క్లుప్తంగా

ఉచిత వైద్య పరీక్షలు



కార్మికులకు టెస్టులు చేస్తున్న సీఎస్‌సీ సభ్యులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో లేబర్‌కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు హైదరాబాద్‌లోని సీఎస్‌సీ కేంద్రం సభ్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో లేబర్‌కార్డు కలిగిన 46 మందికి బీపీ, షుగర్ టెస్టులను ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌సీ కేంద్రం సభ్యులు సాయికృష్ణ, గ్రామస్తులు మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరం



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ శంకర్‌రాథోడ్, తదితరులు

షాబాద్: పేద విద్యార్థులకు దాతలు సహకరించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ శంకర్‌రాథోడ్, కాంగ్రెస్ నాయకుడు యువనేత శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, స్టేషనరీని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరూ తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, శ్యాంసుందర్, కృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు అలివేలు, అంగన్‌వాడీ టీచర్ అనిత, గ్రామస్తులు మల్లేశ్, బందయ్య, సీహెచ్ రాజు, కృష్ణారెడ్డి, నర్సింహులు, యాదగిరి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న నవీన్‌గౌడ్

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన బొద్ద శంకరయ్యకు చెందిన మూగజీవాలు ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందిన విషయం విదితమే.కాగా బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ మంగళవారం రూ.10వేల నగదు అందజేసి ఆదుకున్నాడు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, సురేందర్, కృష్ణ, చిట్టిపాల్గొన్నారు.

మిషన్ భగీరథపై కొనసాగుతున్న సర్వే



నల్లా కనెక్షన్లపై సర్వే చేస్తున్న అధికారులు

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరులో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ ఏర్పాటు చేసిన నల్లాలు, పైప్‌లైన్ల వివరాలను మంగళవారం ఎంపీడీఓ సంధ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ సేకరించారు. మిషన్ భగీరథ నల్లా ఉందా.. నీళ్లు ఎన్ని రోజులకోసారి వస్తున్నాయి.. అనే విషయాలను తెలుసుకున్నారు. నల్లాతో పాటు ఇంటి యజమాని ఫొటోను తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సంధ్య మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నల్లాలపై అన్ని గ్రామాల్లో సర్వే చేస్తున్నామని అధికారులందరూ ఇదే పనిలో ఉన్నారన్నారు. సర్వేను వేగవంతం చేసి త్వరలోనే పూర్తి చేసేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కారోబార్ రాజేశ్, బిల్ కలెక్టర్ దర్శన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఇబ్రహీంపట్నం రూరల్: చర్లపటేల్‌గూడ మాజీ సర్పంచ్, ఉప్పరిగూడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ కంబాలపల్లి హన్మంత్‌రెడ్డి అంత్యక్రియలు మంగళవారం పూర్తయ్యాయి.ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి హన్మంత్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మధుసూదన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



కంకరపోసిన చిలుకూరు-మొయినాబాద్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



రెండువైపులా మట్టి ఎత్తుగా పోయడంతో గుంత ఏర్పడి నిలిచిన వర్షం నీరు

- అధ్వానంగా మారిన చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడి చేసి మొదలుపెట్టిన రోడ్డు పనులు అర్ధంతరంగానే నిలిచిపోయాయి. మట్టి, కంకరపోసి వదిలేయడంతో వర్షాలకు నీళ్లు నిలిచి రోడ్డు అధ్వానంగా మారింది. ఇది ఎక్కడో మారుమూల పల్లె రోడ్డు అనుకుంటే పొరపాటే. హైదరాబాద్ మహానగర శివారుల్లో బాలాజీ టెంపుల్‌తో పేరుగాంచిన చిలుకూరు గ్రామ రోడ్డు ఇది. మొయినాబాద్ మండల కేంద్రం నుంచి చిలుకూరు గ్రామానికి 2.5 కిలోమీటర్ల దూరం లింకు రోడ్డు ఉంది. ఈ రోడ్డును బీటీరోడ్డుగా మార్చాలని ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించారు. స్పందించిన అధికారులు రెండేళ్ల క్రితం చిలుకూరు నుంచి సురంగల్ వరకు వయా మొయినాబాద్ మీదుగా ఆరు కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు వేసేందుకు రూ.2.20 లక్షలు మంజూరు చేయించారు. అయితే కాంట్రాక్టర్ సురంగల్ నుంచి పనులు మొదలుపెట్టి సుమారు రెండు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు వేశారు. అదికూడా నాణ్యతా లోపంతో వేయడంతో వేసిన రెండు నెలలకే దెబ్బతిన్నది. ఇక చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు గత అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా పనులు మొదలుపెట్టారు. ఎన్నికలకు ఒక రోజు ముందు సుమారు వంద మీటర్ల దూరం బీటీ సైతం వేశారు. సుమారు రెండు కిలోమీటర్లకుపైగా దూరం మట్టి, కంకర పోసి వదిలేయడంతో ఇటీవల వర్షాలు కురవడంతో రోడ్డుపై వర్షం నీరు నిలుస్తోంది. రోడ్డుకు ఇరువైపులా మట్టి ఎత్తుగా పోయడంతో వర్షం నీళ్లు రోడ్డుపైనే నిలుస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు పనులు జరగడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

మట్టి, కంకర పోసి వదిలేశారు



చిలుకూరు-మొయినాబాద్ బీటీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు జరగడం లేదు. ఆరునెలల క్రితం హడావిడి చేసి మట్టి, కంకర పోశారు. వందమీటర్ల దూరం బీటీ కూడా వేశారు. ఆ తరువాత పనులను పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రోడ్డు మధ్యలో నీళ్లు నిలిచి చాలా ఇబ్బంది పడుతున్నాం.

– జొన్నాడ రాజు, చిలుకూరు

త్వరలోనే పనులు మొదలవుతాయి



చిలుకూరు నుంచి సురంగల్ వరకు బీటీరోడ్డు మంజూరైంది. కానీ సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు మాత్రమే బీటీ వేశాం. మొయినాబాద్ నుంచి చిలుకూరు వరకు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కాంట్రాక్టర్ డబ్బులు లేవని నిర్లక్ష్యం చేస్తున్నాడు. రెండురోజుల క్రితమే కాంట్రాక్టర్‌కు పనులు చేయాలని చెప్పాం. త్వరలోనే బీటీరోడ్డు పనులు మొదలవుతాయి.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్

‘ప్రజాపాలన’ను సద్వినియోగం చేసుకోండి

ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



సేవా కేంద్రంలో దరఖాస్తుల రీఎంట్రీ కోసం క్యూలో నిల్చున్న ప్రజలు

కేశంపేట: గతంలో ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పు లు ఉంటే మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో సరిచేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సబ్సిడీ, గ్యాస్ రాయితీ, గతంలో ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పులు ఉంటే రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఎలక్ట్రిసిటీ సర్వీస్ నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్ ఒరిజినల్స్‌తో సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తుదారులు సేవా కేంద్రానికి వచ్చేటప్పుడు దరఖాస్తులో తెలిపిన మొబైల్‌నంబర్ తీసుకురావాలని ఆయన కోరారు. దరఖాస్తు రీఎంట్రి చేసే సమయంలో ఓటీపీ వస్తుందని ఆయన తెలిపారు. త్వరలోనే ప్రజాపాలన దరఖాస్తులను కూడా స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

అదనపు బస్సులు నడపాలి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే విద్యార్థులు, ప్రజల కోసం ప్రభుత్వం అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పి గ్రామాలకు వచ్చే బస్సుల సంఖ్యను పూర్తిగా తగ్గించిందని ఆరోపించారు. ఆర్డినరీ సర్వీసులు కూడా తగ్గాయని ఆరోపించారు. దీంతో ఉచిత బస్సు ప్రయాణమే అయినా గ్రామాల్లో ఉండే ప్రజలు, మహిళలు ఈ బస్సులను ఉపయోగించుకోలేక పోతున్నారన్నారు. గ్రామాల నుంచి విద్యాభ్యాసం కోసం విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా సమయానికి బస్సు సౌకర్యం ఉండాల్సిందే లేదంటే వారు బస్సు వచ్చేదాక ఆగే పరిస్థితి ఉండదు. దీంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి వెళ్తున్నారన్నారు. గ్రామాలకు తప్పనిసరిగా విద్యార్థుల సమయాలకు అనుగుణంగా ఉదయం సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గతంతో పోలిస్తే గ్రామాలకు వెళ్లే బస్సుల సంఖ్య తగ్గిందని తెలుస్తోందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల సంఖ్య పెంచాలన్నారు. సమావేశంలో బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు బండారి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.మచ్చేందర్‌రెడ్డి, జైసింహారెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని ఉత్తరాసిపల్లి గ్రామం నుంచి ఉమ్మెంత్యాల వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పల్లెకు రోడ్డు ఉంటేనే పల్లెలు అన్ని రంగాల్లో రాణిస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తోందని, పేదల కోసం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, మల్లేశ్‌గౌడ్, ఆంజనేయులు, అంజిరెడ్డి, ఫయూమ్, కృష్ణయ్య, నర్సింలు, రవి, రామచంద్రయ్య, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్, తదితరులు

షాబాద్: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తుడు వడ్ల చంద్రశేఖర్ విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరక్ష్యరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమవంతు పాలుపంచుకోవాలని చెప్పారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని లక్ష్యసాధనకు పట్టుదలతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామీయా పటేల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్, నర్సింహా, కృష్ణ, యాదయ్య, శ్రీనివాస్, రాముగౌడ్, నర్సింహారెడ్డి, దయానంద్‌గౌడ్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమానికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని, పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ బాధ్యత వహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను రద్దు చేయాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో నష్టపోయిన బాధిత విద్యార్థులకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, మహేందర్, నవీన్, అరుణ్, శ్రీను, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీణకు డాక్టరేట్



వీణకు డాక్టరేట్ అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ క్రిష్టఫర్, తదితరులు

మొయినాబాద్‌రూరల్: కష్టపడి చదివితేనే విజయం వరిస్తుందని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య టి.క్రిష్టఫర్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల ఆ యూనివర్సిటీలో ఏ.వీణకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పొందిన వీణ చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో సూక్ష్మ జీవశాస్త్ర విభాగంలో స్టడీస్ ఆఫ్ ఇండస్ట్రీయలి ఇంపార్టెంట్ ఈస్ట్ విత్ స్పెషల్ ప్రిఫరెన్స్ టూ ఎన్వీరాన్‌మెంట్ ఆఫ్ అమైయిలో లైటిక్ యాక్టివిటీ అనే అంశంపై ఆచార్య బీ.ఎస్.అనురాధ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దీంతో ఆమెకు మంగళవారం క్రిష్టఫర్ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశోధనలు నిర్వహిస్తున్న వారు కేవలం డాక్టరేట్ కోసమే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని ఆయన సూచించారు. వీణ నిర్వహించిన సూక్ష్మ జీవశాస్త్ర పరిశోధన ఎంతో మెరుగైందని ఆయన అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, రవీందర్, జగదీశ్వర్, సుందర్‌రామ్, అనురాధ, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డంప్‌యార్డు నిర్మించొద్దు

తహసీల్దార్ కార్యాలయంలో స్థానికుల వినతి



సూపరింటెండెంట్‌కి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండలంలోని బయన్నగూడ గ్రామంలో నిర్మిస్తున్న డంప్‌యార్డు నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ మంగళవారం ఆ గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మహాలింగాపురం గ్రామానికి చెందిన చెత్తను కూడా బయన్నగూడలో నిర్మించే డంప్‌యార్డులోనే వేయాలని అధికారులు నిర్ణయించారన్నారు. అయితే ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. తమ గ్రామంలో డంప్‌యార్డు నిర్మించే స్థలానికి సమీపంలోనే గ్రామ దేవుడు బయన్నగుడి ఉందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని వినతిలో పేర్కొన్నామని తెలిపారు. మూడు ఏళ్ల క్రితం ఈ విధమైన నిర్ణయం తీసుకుంటే వ్యతిరేకించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ఇళ్లన్నీ జలమయం



మేడిపల్లిలో చెరువులోకి వెళ్లే దారిలేక సీసీ రోడ్డుపై నుంచి ఎస్సీ బస్తీలోకి వెళ్తున్న వరదనీరు

- చెరువులోకి వెళ్లే దారిలేక ఇళ్లలోకి చేరిన వరదనీరు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తుల ఆగ్రహం

మొయినాబాద్: వరదనీరు చెరువులోకి వెళ్లే దారి లేకపోవడంతో పేదల ఇళ్లలోకి దూసుకొచ్చింది. ఇళ్లన్నీ జలమయం కావడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. మండల పరిధిలోని మేడిపల్లిలో సోమవారం సాయంత్ర భారీ వర్షం కురవడంతో గ్రామంలోని వరదనీరు గ్రామ సమీపంలోకి వెళ్లే దారిలేకపోవడంతో ఎస్సీ కాలనీలోకి మళ్లింది. గతంలో గ్రామంలో ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ ఉండేది. ఆ సమయంలో మురుగు నీటితో పాటు వర్షం నీరు కూడా ఓపెన్ డ్రైనేజీ ద్వారా గ్రామ సమీపంలో ఉన్న చెరువులోకి వెళ్లేవి. అయితే కొంత కాలం క్రితం గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వేశారు. వర్షం నీరు డ్రైనేజీలోకి వెళ్లకుండా రోడ్లపై పారుతూ చెరువులోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వర్షం నీరు చెరువులోకి వెళ్లే విధంగా కాల్వను ఏర్పాటు చేయలేదు. దీంతో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గ్రామంలోని వరద నీరంతా రోడ్లపై పారుతూ కింది భాగంలో ఉన్న ఎస్సీ బస్తీలోకి చేరింది. చాలా ఇళ్లలోకి వరదనీరు వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతోనే వరద నీరు ఇళ్లలోకి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామస్తులు అధికారులను కలిసి ఇళ్లలోకి వచ్చిన వరద పరిస్థితిని వివరించారు.



మేడిపల్లిలో ఇళ్లలోకి చేరిన వరదనీరు

హామీల అమలులో నిర్లక్ష్యం

బీజేపీ నాయకుడు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి



పింఛన్‌దారులతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ సీనియర్ నాయకుడు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో పింఛన్‌దారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలన్నారు. పింఛన్ రూ.4వేలకు పెంచుతామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదని ఆరోపించారు. నూతన రేషన్‌కార్డుల మంజూరుతో పాటు మార్పులు, చేర్పులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, హామీల అమలులో నిర్లక్ష్యం సరికాదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో ఆలస్యం చేస్తే బీజేపీ తరఫున ప్రజా ఉద్యమాలను చేపడుతామని హెచ్చరించారు.

ఏపీఎం రామస్వామిపై చర్య తీసుకోవాలి

కొందుర్గు: మహిళా వీఓఏల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్న ఏపీఎం రామస్వామిపై చర్య తీసుకోవాలని మంగళవారం బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రామస్వామి మహిళల పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై సమగ్ర విచారణ జరిపి అతడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, కురుమయ్య పాల్గొన్నారు.

రామస్వామిపై ఆరోపణలు సరికాదు..

ఏపీఎం రామస్వామిపై చేస్తున్న ఆరోపణలు సరికావని మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల అనంతయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. విధి నిర్వహణలో భాగంగా కఠినంగా వ్యవహరిస్తే ఇలాంటి నిందలు మోపడం సమంజసం కాదన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తూ అతడిపై రాజకీయం చేస్తే సహించేది లేదన్నారు.